క్లుప్తంగా

లక్ష్య సాధనకు తోడ్పాటు అందించాలి

కోస్గి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సృజనాత్మకతను పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయురాలు పద్మబాయి అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులకు సెల్‌ఫోన్‌లు ఇవ్వకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. క్రీడల్లో రాణించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మౌలానా, ఖాజా కుతుబుద్దీన్ , అస్లాందుర్రాని, తదితరులు ఉన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

మరికల్: వర్షాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులతో నమోదు చేసుకోవాలని ఏఈఓ పరుశురామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు పాసు పుస్తకం జిరాక్స్ తీసుకెళ్లి వివరాలను నమోదు చేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయల దగ్గర పంటల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలి



కృష్ణా: మండలంలోని విద్యార్థులు విధిగా క్రీడల్లో పాల్గొనాలని ఎంఈఓ నిజాముద్దీన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండల స్థాయి ఆట పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇదే క్రీడ స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కిషోర్‌కుమార్, ఉపాధ్యాయులు నాగరాజు, శివరాజ్, రాఘవేంద్ర, అనిల్, పీఈటీలు మీనాకుమారి, సౌమ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ దివస్ వేడుకలు



కోస్గి రూరల్: జాతీయ భాష అయిన హిందీ దివస్‌ను ఘనంగా చేపట్టామని ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వరీ అన్నారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ భాషపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హిందీని నేర్చుకోవడం వల్ల దేశంలో ఎక్కడికి వెళ్లిన భాష పరమైన ఇబ్బందులు తలెత్తవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశిరేఖ, శ్రీదేవి, వసంత, అలవేలు, సబిత, నవిత, రాజేందర్‌రావు, గీతాలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మద్దూరు: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కొత్తపల్లి మండలం దుప్పటిగట్టు గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి కోయిల్‌కొండ నుంచి మద్దూరుకు ఇసుక తరలిస్తున్న క్రమంలో తనిఖీలు చేపట్టగా ఎలాంటి ధృవపత్రాలు లేకపోవడంతో పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడాకారులకు సన్మానం



మక్తల్: షూటింగ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో శనివారం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిరంలో దాదాపు 50 మంది షూటింగ్ బాల్ క్రీడాకారులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్రాంతి పీఈటీ గోపాలం మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి రాష్ట్ర , జాతీయ స్థాయిల్లో రాణించిన క్రీడాకారులను సన్మానించినట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, మక్తల్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యఅంజనేయులు, పీఈటీలు స్వప్న, అనూష, దివ్య, రమేశ్, త్రివేని పాల్గొన్నారు.

కళాశాలల ఏర్పాటుపై హర్షం

- గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి ఇంటర్ విద్య
- కొత్తపల్లి, గుండుమాల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్మాణం



భూనీడులో పిల్లర్ల వరకు పూర్తి అయిన కళాశాల భవనం

కొత్తపల్లి: పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది సీఎంగా బాధ్యతలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో జూనియర్ కాలేజీలు లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు చదువుకు దూరమవుతుండడంతో రెండు మండలాల్లో కళాశాలల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కొత్తపల్లి, గుండుమాల్ మండలాలకు చెందిన 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌లో చేరాలంటే కోస్గి, మద్దూరు, కోయిల్‌కొండ, నారాయణ పేటకు వెళ్లి చదువుకోవాలసి వచ్చేది. అయితే అంత దూరం వెళ్లాలంటే రవాణా ఖర్చులు భారంగా మారడంతో అనేక మంది చదువు మానేసేవారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం గుండుమాల్, కొత్తపల్లి మండలాల్లో సమీకృత మండల కార్యాలయాలకు రూ.17.60 కోట్లు అలాగే కాలేజీల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులు కూడా ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలల నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తి కాగా వచ్చే ఏడాది అకాడమిక్ ఇయర్‌కు పూర్తి కానున్నాయి. తమ మండలాల్లోనే ఇంటర్ కళాశాలలు ఏర్పాటు అవుతుండడంతో స్థానిక విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇరుకు గదుల్లో కొనసాగుతున్న కళాశాల

పాత భవనాల్లో తరగతుల నిర్వహణ

కొత్తపల్లితో పాటు గుండుమాల్ మండలాల్లో కళాశాలల నిర్మాణం చేపట్టడంతో ప్రస్తుతానికి పాత భవనాల్లోనే ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులు ప్రారంభమైన మొదటి ఏడాదే గుండుమాల్‌లో 88 మంది కొత్తపల్లి మండలం భూనీడులో 80 మంది విద్యార్థులు చేరి పలు కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గదులు ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నూతన కళాశాలల నిర్మాణం పూర్తయ్యే వరకు కనీస వసతులు కల్పిస్తే తమ ఇబ్బందులు తీరుతాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



ప్రస్తుతం కళాశాలల నిర్మాణం జరుగుతుండడంతో భూనీడులో అరకొర సౌకర్యాల మధ్య ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నాం. గదులు ఇరుకుగా ఉండడంతో విద్యార్థులకు బోధించడం ఇబ్బందిగా మారింది. నిర్మాణ పనులు వేగవంతం చేసి వచ్చే విద్యాసంవత్సరం నాటికి పూర్తి చేసి తమకు అప్పగిస్తే సమస్యలు తీరుతాయి.

– ప్రసన్న రాణి, భూనీడు కళాశాల ప్రిన్సిపాల్

దివ్యాంగుల పింఛన్ పెంచాలి



ఆర్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

నారాయణ పేట టౌన్: దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి ఇవ్వాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నారాయణపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌ఐ గోపాల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు మిగితా చేయూత పెన్షన్ రూ.4వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చి ఇంత వరకు అమలుచేయకపోవడం సరికాదన్నారు. ఇకనైనా స్పందించి పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహా కార్యదర్శి బాలరాజు, మండల ఉపాధ్యక్షుడు హన్మంత్, మండల సహ కార్యదర్శి బీరప్పతదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.6వేలకు పెంచాలి

మద్దూరు: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ. 6 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదక ఆధ్వర్యంలో మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట దివ్యాంగులు శనివారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడి 21 నెలల గడిచినా పెంపు ఊసే లేదన్నారు. వెంటనే పింఛన్ల పెంపు చేపట్టి, కొత్త పింఛన్ల మంజూరు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములుకు వినతిపత్రం అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

మాగనూర్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ సంఘం నాయకులు పుంజనూర్ బాబు కోరారు. ఈ మేరకు మాగనూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. నాయకులు దివ్యాంగుల సంఘం మండల నాయకులు పుంజనూర్ బాబు, లంగటి వాబయ్య, ఈడ్గి సత్యానారాయణ, సగరం నర్సింహులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందాం'



రాంచందర్‌రావును సన్మానిస్తున్న కొండయ్య

మక్తల్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతి కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్యతో పాటు ఇతర నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కలిసికట్టుగా పనిచేద్దామని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ, రాష్ట్ర నాయకుడు రవికుమార్, సోంశేఖర్‌గౌడ్, విద్యాసాగర్, నాగప్ప, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎంఈఓ మురళీధర్ రెడ్డి, నాయకులు

మాగనూర్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా మంజూరైన రూ. 22 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఎంఈవో మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అదనపు గదుల నిర్మాణంతో విద్యార్థులకు నూతనంగా సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ ఇందిరమ్మ, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దండు ఆనంద్, గ్రామ మాజీ సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాలో ఉపాధ్యాయుల ప్రతిభ



కోస్గి రూరల్: ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఇటీవల నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో పలువురు ఉపాధ్యాయుల ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారు. మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తెలుగు విభాగంలోని పరిసరాల విజ్ఞానంలో ప్రతిభ చూపి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ముశ్రీఫా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉర్దూ విభాగంలో ఉస్మాన్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

నేడు రథయాత్ర

నారాయణపేట టౌన్: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, భవానీ మాత బ్రహ్మోత్సవాలు యానగుంది సూర్యనంది క్షేత్రంపై సోమవారం నుంచి ఘనంగా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు శివరాం రెడ్డి శనివారం తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారిని వెండి రథంపై ఆశీనులు చేసి ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రోడ్లను బాగు చేయాలి

కృష్ణా: మండలంలోని సూకూర్‌లింగంపల్లి, ముదహర్‌దొడ్డి, అడవి ఖానాపూర్, ఐనాపూర్ గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంతర్గత రహదారులతో పాటు గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లు బురదతో నిండి ఉన్నాయి. పారిశుద్ధ్యం నిర్వహణ కూడా సరిగా లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్లను బాగా చేయాలని కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ధన్వాడ: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు విరాళం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి శనివారం అమ్మవారి భక్తులకు రూ. 20 వేలు విరాళం అందజేశారు. సూర్యచంద్ర ఫౌండేషన్ దైవ కార్యక్రమాలకే కాకుండా పేదలకు సాయమందించడానికి ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం అమ్మవారి భక్తులు ఆయన్ను ఘనంగ సన్మానించారు. కార్యక్రమంలో దేవేందర్‌గౌడ్, అంజిరెడ్డి, కేశవులు, రాములు, వెంకటేష్, రాము పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన అల్లం బాయి జ్యోతి, తట్టిపల్లి లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం సాయమందించాలని మాజీ ఎంపీటీసీ చెన్నయ్య సహకారంతో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో సీఎం సహాయనిధి నుంచి రూ. 92వేలు మంజూరు కాగా సంబంధించిన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతికుమార్,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

మద్దూరు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఆ తర్వాత సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని మండల వైద్యాధికారిణి శ్రీలత తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ' స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ ' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విజయలక్ష్మి అష్టమాలజీ, డాక్టర్ రమ్య ఈఎన్‌టీ, ఇతర డాక్టర్లు మహిళలను పరీక్షించి మందులు అందజేశారు. వచ్చే నెల 2 వరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నరేష్, విజయ్, వెంకటేష్, సుమన, మౌనిక, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్తల్ వైద్యశిబిరం ఏర్పాటు

మక్తల్: మండలంలోని కర్ని పీహెచ్‌సీలో 'స్వస్థ నారి-స్వశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు. టీబీ పరీక్షలు చేయడంతో పాటు వివిధ వ్యాధులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తిక్, సాయికాంతరెడ్డి, తిరుపతి, సులోచనమ్మ, అండలమ్మ, శ్రీధర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా నాలుగు రోడ్ల కూడలి



నీరు నిలిచిన అధ్వానంగా తయారైన రోడ్డు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి వైన్స్ వరకు దాదాపు అడుగు లోతు గుంతలు ఏర్పడ్డాయి. చినుకు పడితే చాలు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టి తాత్కాలికంగా అయిన పూడ్చి వేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మక్తల్: మండలకేంద్రంలో ఇటీవల నిర్వహించిన క్రీడల్లో అండర్-14 విభాగంలో చంద్ర, సిద్దార్థరాజ్, జగదీశ్, హర్షిత్, తేజ, సల్మాన్, అతిక్, అభిసేక్, చాతుర్య, వసిద్దిన్, నాగచైతన్య, యువరాజు, చరణ్, సాయి హర్షిత్, శ్రీకర్‌రెడ్డి, సరోడే, ప్రజ్వల్, షారిక్‌లు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారి వెంకటేశ్ తెలిపారు. అలాగే అండర్-17 బాలుర విభాగంలో మణివర్ధన్, మహ్మద్, అతిక్షం, మహేస మణివర్ధన్, రామ్‌చరన్, జలందర్, శ్రీకాంత్, నవీన్, శంకర్, ఒబెత్, సాయి బద్రి, మహ్మద్,శివం ఉమ్మడి జిల్లాకు ఎంపిక య్యారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను శనివారం అభినందించారు. జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ఎంఈఓ అనిల్‌గౌడ్, డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



దామరగిద్దలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



నారాయణపేటలోని బండగొండ యూపీఎస్ స్కూల్‌లో..



బతుకమ్మ వేడుకల్లో జ్ఞాన సంఘమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ముందస్తు దసరా ఉత్సవాలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మలను ఉంచి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.

- నారాయణపేటలోని జాజాపూర్, సింగారం, అమ్మిరెడ్డిపల్లి, బండగొండ, కొల్లంపల్లి, కోటకొండతో పాటు పట్టణంలోని శ్రీసాయి, శిశుమందిర్, బ్రిలియంట్, కృష్ణవేణి తదితర ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు జరిగాయి. కోలాటాలు, దాండియా ఆటలతో బతుకమ్మ పాటలతో చిన్నారులతో కలిసి టీచర్లు చిందేశారు. అనంతరం శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు.
- కృష్ణాలోని జ్ఞానసంఘం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆడిపాడారు. అనంతరం బతుకమ్మ ఆడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శీలా మంజునాథ్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, తాయమ్మ తదితరులు పాల్గొన్నారు.
- కోస్గిలో ముశ్రీఫా ఉన్నత పాఠశాల, మీర్జాపూర్ ఉన్నత పాఠశాల , పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, వేదా ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు.
- మక్తల్‌లోని న్యూటాలెంట్ నోబుల్ , బ్రిలియంట్ పాఠశాలల్లో విద్యార్థులు పూలతో తయారు చేసి బతుకమ్మలను ఉంచి సందడి చేశారు.
- మాగనూర్‌లోని వడ్వాట్, నేరడగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.
- కొత్తపల్లి, మద్దూరులోని రెనివట్ల, కృష్ణవేణి, గీతాంజలి, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి వాటి చుట్టు ఆటలాడారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.
- నర్వ, దామరగిద్దలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆడిపాడి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



రెనివట్లలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు



నేరడగం పాఠశాలలో బతుకమ్మతో చిన్నారులు



మక్తల్‌లో బతుకమ్మను తయారు చేసుకొని వెళ్తున్న యువతులు, చిన్నారులు